ఏఎమ్మార్పీ తూముల వద్ద నిరంతర గస్తీ

- గుర్రంపోడు డివిజన్ పరిధిలో 13మంది లష్కర్‌ల నియామకం
- ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు నీటి విడుదల చేసిన నేపథ్యంలో నిఘా

గుర్రంపోడు: తాగునీటి అవసరాలకు గాను నల్లగొండలోని ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నింపేందుకు ఏఎమ్మార్పీ ప్రధాన కాలవ్కు నీటి విడుదల జరుగుతున్న క్రమంలో రైతులు తూముల గేట్లను ఎత్తకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం గుర్రంపోడు ఏఎమ్మార్పీ డివిజన్‌కు 13 మంది లష్కర్‌లను కేటాయించడంతో వారు అధికారుల పర్యవేక్షణలో రాత్రి, పగలు షిఫ్టుల వారీగా ఒక్కో లష్కర్ నాలుగు తూముల వరకు బాధ్యత తీసుకుని కాపలా కాస్తున్నారు. నలుగురు లష్కర్‌లకు ఒక ఏఈ స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తూ గేట్లను ఎత్తకుండా నిఘా పెడుతున్నారు. గుర్రంపోడు డివిజన్ పరిధిలో డి–19 నుంచి ఉదయ సముద్రం వరకు డి–38 వరకు ఎక్కువ భాగం తూములు ఉండటంతో డివిజన్ ఈఈ పర్యవేక్షణలో రాత్రి వేళ కాల్వ గట్లపై గస్తీ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో తూములకు ఎక్కకుండా తక్కువ మోతాదులో కాల్వలో నీటిని విడుదల చేసి ఉదయ సముద్రంకు నీటిని సరఫరా చేసేవారు. ఐతే ప్రస్తుతం వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తేలా ఉండటం, ఉదయం సముద్రంను ఒక టీఎంసీ వరకు నీటిని నింపాల్సి ఉండటంతో సుమారు 800 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా కొన్ని చోట్ల లష్కర్‌ల కళ్లుగప్పి తూముల సమీపంలోని రైతులు గేట్లను ఎత్తుతుండటం అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో గేట్లను ఎత్తినా, ధ్వంసమైనా ఆయా తూములకు కేటాయించిన అధికారులను బాధ్యులను చేస్తామనడంతో అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు.


గుర్రంపోడులోని డి-21 తూము గేటు వద్ద కాపలా కాస్తున్న లష్కర్‌లు

గేట్లు ఎత్తితే కేసులు పెడతాం

ఏఎమ్మార్పీ గేట్లను ఎత్తడంతో తూములు, కాల్వలను ధ్వంసం చేసే వారిని గుర్తించి పోలీసు కేసులు నమోదు చేస్తాం. తూముల వద్ద అనుమానాస్పదంగా సంచరించే వారిని గుర్తిస్తున్నాం. కేవలం ఉదయ సముద్రంకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నందున రైతులు సహకరించాలి.

– ఆనందరావు, డివిజన్ ఈఈ

క్లుప్తంగా

యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా సతీష్‌గౌడ్


నియామక పత్రం అందుకుంటున్న సతీష్‌గౌడ్

దేవరకొండ: బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి సతీష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో బీసీ పొలిటికల్ జేఏసీ సమావేశంలో చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో జేఏసీ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కలగొని రమేశ్, కుంభం మధు, మట్టపల్లి అనిల్, కె. శివ, పచ్చిపాల మహేశ్‌యాదవ్, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్


జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ప్రసాద్‌నాయక్

హాలియా: మున్సిపాలిటీలోని 8వ వార్డు కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్‌నాయక్ బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి నివాసంలో జానారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో ప్రసాద్‌నాయక్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు పిల్లి ఆంజనేయులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి

గుర్రంపోడు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ. అపర్ణ, ఉపాధ్యాయులు సీతారామరాజు, శ్రీనివాస్, కరుణాకర్, ఏడుకొండలు, లింగస్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడిగా వంగాల విజయ్

త్రిపురారం: తెలంగాణ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎస్ ఎమ్మార్పీఎస్) త్రిపురారం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వంగాల విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సభ్యుల సమావేశంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ టీఎస్ ఎమ్మార్పీస్ అధ్యక్షుడు గన్నెపాక లక్ష్మణ్ వంగాల విజయ్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మేదరి నాగరాజు, పడిశల వెంకన్న, పోదుగంటి రవి, వింజమూరు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఇద్దరికి గాయాలు

చింతపల్లి: హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని మదనాపురం వద్ద మంగళవారం రాత్రి బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి హాలియాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మదనాపురం వద్ద చింతపల్లి నుంచి మాల్ వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మర్రిగూడ మండలం చొల్లేడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, ఇరువురిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో అందుబాటులో ఉండని హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను వారు పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు అందించాల్సిన మెనూ విషయంలో హాస్టల్ వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థులను వర్కర్లు బూతులు తిడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, చంద్రశేఖర్, మహేశ్, శ్రీను తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి

మాడుగులపల్లి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి మాడుగులపల్లి మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్, హెల్మెట్, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని సూచించారు. మైనర్లు, లైసెన్స్ లేనివారు వాహనాలు నడపడం నేరమన్నారు. ఆయన వెంట మాడుగులపల్లి ఎస్‌ఐ నరేష్‌కుమార్, పోలీసు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

మిర్యాలగూడ అర్బన్: బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర డైరీని మిర్యాలగూడ డీఎస్పీ పి. వెంకటగిరి మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మారం శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు చేగొండి మురళీయాదవ్, జయరాజు, నాగభూషణం, సుధాకర్ తదితరులున్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

మిర్యాలగూడ అర్బన్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలగాని వెంకటేష్‌గౌడ్, మురళియాదవ్, నాగభూషణచారి, సత్యనారాయణ తదితరులున్నారు.

లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరిస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో నూతన కమిటీ సభ్యుల ఎంపిక కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సింగాపురం మల్లారెడ్డి, సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అనంతుల నాగరాజు, కార్యదర్శిగా గార్లపాటి రాంభద్రారెడ్డి, కోశాధికారిగా ఆత్మూరి నవీన్‌కుమార్ ఎన్నిక కాగా వారిని ఘనంగా సన్మానించారు.

ఢిల్లీకి తరలిన బీసీ నేతలు

మిర్యాలగూడ టౌన్: బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు మంగళవారం హైదరాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మిర్యాలగూడ నియోజకవర్గం బీసీ సంఘం నాయకులు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు ప్రత్యేకాధికారులతో సమావేశం

దేవరకొండ: పట్టణంలోని సాయిశివ ఫంక్షన్ హాల్‌లో బుధవారం దేవరకొండ నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఈ సమావేశానికి హాజరై ప్రత్యేకాధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

సంప్రదాయ కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

హాలియా: అంతరించిపోతున్న గ్రామీణ ప్రాంత సంప్రదాయ కళలపై మహిళలు ఆసక్తి పెంపొందించుకోవాలని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన మహిళా కోలాట మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలంతా ఒక గ్రూపుగా ఏర్పడి కోలాటం నేర్చుకుని అంతరించిపోతున్న కళకు జీవం పోస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కోలాటం గ్రూపు మహిళలకు బుసిరెడ్డి పాండురంగారెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కోలాటం నేర్చుకున్న మహిళలు పాండురంగారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటయ్య, ఉప సర్పంచ్ ఉడ్తూరి రామాంజిరెడ్డి, అలుగుల వెంకట్‌రెడ్డి, గోవిందరెడ్డి, పంగ లక్ష్మణ్, గోవింద్, మేకల సతీష్, చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


హాలియా: బుసిరెడ్డి పాండురంగారెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

గ్రంథాలయ నిర్మాణానికి విరాళం

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామంలో చేపట్టిన గ్రంథాలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ తిరుగుడు జ్యోతిలింగారెడ్డి అభ్యర్థన మేరకు మంగళవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి రూ.30వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు తేలుకుంట్ల రవికుమార్, గణేష్, రమేష్, నవీన్, తిరుమలగిరి(సాగర్) వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ జనార్దన్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

విద్యుత్ డీఈకి వినతి

కొండమల్లేపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కొండమల్లేపల్లి విద్యుత్ డీఈ విద్యాసాగర్‌కు విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం అధ్యక్షుడు తిరుపతయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకంతో తమపై పని భారం పెరుగుతుందని పేర్కొన్నారు. తమకు సమాన పనికి సమాన వేతనం, అర్హత గల వారిని సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా తీసుకోవాలని కోరారు. సత్యనారాయణ. మహేశ్, జైపాల్, సాయివికాస్‌రెడ్డి, పవన్ తదితరులున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కొండమల్లేపల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్‌ఎఫ్‌ఐ) పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ సొభాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కొండమల్లేపల్లిలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు ఆడెపు వీరేందర్, రాజేశ్‌నాయక్, రవినాయక్, నాగు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

డిండి: మండల పరిధిలోని రహమంతాపూర్ గ్రామానికి చెందిన అశ్విని రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె తలకు తీవ్రగాయం కావడంతో సర్జరీ చేసేందుకు దాదాపు రూ.10లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న అశ్విని తల్లిదండ్రులకు దేవరకొండ హెల్పింగ్ హ్యాండ్స్ అసోషియేషన్ వారు మంగళవారం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అన్వేష్‌రెడ్డి, కేశా, నరేష్, రిషి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారికి సన్మానం

మిర్యాలగూడ: మండలంలోని ఆలగడప, సుబ్బారెడ్డిగూడెం గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంపత్‌కుమార్‌ను మంగళవారం గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్, గజ్జల కోటిరెడ్డి, మంద సైదులు, వంగాల వెంకట్‌రెడ్డి, వెంకన్న, శ్రీను, సిబ్బంది జనార్దన్‌రెడ్డి, బొల్లం లింగయ్య, మంద దానయ్య, మారయ్య పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మిర్యాలగూడ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా కాకముందే బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎంను చెప్పుతో కొడతానని చెప్పు చూపించడం సరికాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాకునూరి బసవయ్య, సీనియర్ నేత ఆవుల బక్కారెడ్డి, నర్సింగ్ వెంకటేశ్వర్లు, చాంద్‌పాషా, ఇమ్రాన్, సురేష్, నారాయణ, విష్ణు తదితరులున్నారు.

బాల్క సుమన్‌ను అరెస్ట్ చేయాలి..

మిర్యాలగూడ: సీఎం రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు తమ ప్రవర్తన మార్చుకోకపోతే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో అల్లం నాగరాజు, ఆడోతు నాగునాయక్, మాలోతు శివనాయక్, కృష్ణనాయక్, ఆనంద్‌నాయక్, శివనాయక్, శివచరణ్, నాగరాజు, రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం..

వేములపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి అన్నారు. మంగళవారం వేములపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ వెంటనే సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ నాగవెల్లి మధు, మాజీ ఎంపీటీసీ గంజి శ్రీనివాస్, నాయకులు కొమ్ము వెంకన్న, తంగెళ్ల సత్తిరెడ్డి, పుట్టల గురవయ్య పాల్గొన్నారు.

బాల్క సుమన్ తీరు దుర్మార్గం..

హాలియా: సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని ఏకే ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ఇసుక దందాతో కోట్లు గడించిన బాల్క సుమన్‌కి సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని చూపుతున్న సాగర్ సీఐ బీసన్న, పెద్దవూర ఎస్‌ఐ రమేశ్, సిబ్బంది

నాగార్జునసాగర్: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సాగర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ బీసన్న,పెద్దవూర ఎస్‌ఐ రమేశ్‌లు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత ఆగస్టు 28న గుర్తుతెలియని వ్యక్తులు పెద్దవూర మండలం గర్నెకుంట గ్రామానికి చెందిన ఘనపురం లావణ్య కిరాణం షాపు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలతో పాటు రూ. లక్ష నగదును చోరీ చేశారు. బాధితురాలి భర్త అంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఉదయం పెద్దవూర వై జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుముల మండలం చిన్న అనుముల గ్రామానికి చెందిన కూరాకుల మల్లయ్య అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. విచారించగా పెద్దవూర మండలం గర్నెకుంట గ్రామానికి చెందిన ఘనపురం లావణ్య కిరాణం షాపు, ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. నగలను మంగళగిరిలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు. ఆభరణాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరచిన పెద్దవూర ఎస్‌ఐతో పాటు హెడ్‌కానిస్టేబుల్స్ వి.శ్రీనివాస్,జి.యోగి,కానిస్టేబుల్స్ కిషన్,రాజు,రవి హోంగార్డ్‌లను సీఐ అభినందించారు.

ధాన్యం చోరీ కేసులో మరో ఇద్దరు..

ధాన్యం చోరీ కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం.. రైతుల వద్దనుంచి సీసీఏ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని పెద్దవూర మండలం తెప్పలమడుగు అమ్మరైస్ మిల్లువద్ద లాట్లు వేసి ఉంచారు. అనుముల మండలం చల్మారెడ్డిగూడేనికి చెందిన శ్రీకాంత్, నిడమనూరు మండలం నర్సింహుల గూడేనికి చెందిన మహేష్‌లు ఈ నెల 4వ తేదీన ఆటోలో వెళ్లి ఆ ధాన్యాన్ని చోరీ చేసేందుకు యత్నించారు. సెక్యూరిటీ గార్డు కేకలు వేయడంతో ఆటోను వదిలి పారిపోయారు. మంగళవారం ఆటో తీసుకుని వెళ్లేందుకు రైసు మిల్లు వద్ద తచ్చాడుతుండగా మిల్లు యజమాని సమాచారం మేరకు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, బైట్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాల నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, పున్న వెంకటేశ్వర్లు, ఎండీ యూనుస్, లక్పతినాయక్, ఏఆర్‌డీఎస్ అధ్యక్షుడు ఖాజా ఖైరత్ అలీ, బైట్ కంప్యూటర్స్ ఇన్‌చార్జి ఎండీ మహమూద్, ఫాతిమా, ఉమ, నాహిద్, జావిద్ తదితరులున్నారు.

శంకుస్థాపన..

చందంపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.85లక్షలతో చేపట్టిన తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతీచందునాయక్, నాయకులు వెంకటయ్య, ఎంపీటీసీ మల్లయ్య, శ్రీధర్, ఏఈ లస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

హాలియా: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హాలియా పట్టణంలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు మోదాల రవీందర్ మంగళవారం తెలిపారు. జనవరి 28వ తేదీన నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు కె. నిఖిల్, ఎం. పవన్ 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 9, 10వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని నెహ్రూ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆ ఇద్దరు విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్‌యాదవ్, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఆకాంక్ష స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మోదాల రవీందర్

బీఆర్‌ఎస్ పార్టీనే తెలంగాణకు అన్యాయం చేసింది

మిర్యాలగూడ టౌన్: కృష్ణా–గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసింది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నెల్లూరు దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే 15 సాగునీటిపారుదల ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ)కు అప్పగించారని అన్నారు. గత ప్రభుత్వం రంగారెడ్డి–పాలమూరు ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ.7వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80వేల కోట్లకు గాను రూ.లక్ష 30వేల కోట్లు మంజూరు చేసిందని అన్నారు. అప్పుడు బీఆర్‌ఎస్ మంత్రులు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభ పెట్టేది మరోసారి ప్రజలను మోసం చేసేందుకేనని, ఇక్కడ సభ పెట్టే అర్హతకు కూడా బీఆర్‌ఎస్ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా కాకముందే కృష్ణా–గోదావరి జలాల విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల మాయ మాటలు నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కాసుల సత్యం, జిల్లా నాయకులు మాన్యనాయక్, జడరాములు యాదవ్, ఇస్లావత్ సైదానాయక్, పాగుల సైదులు, అంజిబాబు, బొంగరాల మట్టయ్య, జానిమియా, రసూల్ తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

మృతుడి కుటుంబానికి పరామర్శ

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన దస్తగిరి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి వేర్వేరుగా దస్తగిరి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

మందుబాబులకు జరిమానా

మిర్యాలగూడ అర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12మంది వాహనదారులను మంగళవారం మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చగా వారందరికి కలిపి రూ.17,300 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్‌యాదవ్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం

డిండి: మండల పరిధిలోని కందుకూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ, యశోద ఆస్పత్రి మలక్‌పేట వైద్య బృందం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ క్యాంపులో మొత్తం 320 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని, ఇందులో దాదాపు 35 మందికి కంటి శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భిక్షమయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వానం మానికానరేందర్‌రెడ్డి, వెంకటరమణ, ప్రభాకర్, జంగయ్య, వెంకటేశ్వర్లు, రుక్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

కొండమల్లేపల్లి: జిల్లాలో నెల రోజుల పాటు 30 30(ఏ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని కొండమల్లేపల్లి ఎస్‌ఐ వీరబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు.

వాటర్ ట్యాంకర్‌తో నీటి సరఫరా

హాలియా: మున్సిపాలిటీ పరిధిలోని ఓవర్‌హెడ్ ట్యాంకు మెయిన్ గేట్ వాల్వ్ మరమ్మతులకు గురికావడంతో మంగళవారం 6వ వార్డు కౌన్సిలర్ గానీ సుధారాణి మున్సిపాలిటీ సిబ్బంది సహాయంతో వార్డులో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయించారు. మున్సిపల్ అధికారులు మెయిన్ గేట్ వాల్వ్‌కు త్వరితగతిన మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గానీ రాజారమేష్‌యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోలాట బృందానికి ఆర్థికసాయం

త్రిపురారం: మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెంలో కోలాట శిక్షణ పొందుతున్న ఆ గ్రామ మహిళలకు మంగళవారం అదే గ్రామానికి చెందిన కొండా భాస్కర్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్వెనబోయిన వెంకన్న, ఆర్వెనబోయిన రాంబాబు, జొన్నలగడ్డ వెంకన్న, జిట్టబోయిన నాగరాజు, బూర మధు, లక్ష్మణ్, మేకల శంకర్, జొన్నలగడ్డ నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.